

ప్రీతి కుటుంబాన్ని ఆదుకుంటా..
మెడికో విద్యార్థి ధరావత్ ప్రీతి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు.
- IIలో



కేఎంటీపీకి 'మిత్ర'లో చోటు
గ్రేటర్ శివారులోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌కు కేంద్రం మిత్ర పథకంలో చోటు దక్కింది.
- IIIలో

వాతావరణం
గరిష్టం/కనిష్టం 31°/20°
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన అకాల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

న్యాయవాదుల సొసైటీ కార్యవర్గం ఎన్నిక



వరంగల్ లీగల్: న్యాయవాదుల పరస్పర సహకార సొసైటీ అధ్యక్షుడిగా కె.విజయభాస్కర్ రావు, కార్యదర్శిగా రాజకరుణాకర్‌రావు ఎన్నికయ్యారు. రెండు వారాల క్రితం జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన నలుగురు డైరెక్టర్లతో శుక్రవారం ప్రమాణస్వీకారం నిర్వహించిన అనంతరం నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్ష, కార్యదర్శులతోపాటు ఉపాధ్యక్షుడిగా సల్ల కుమార్, కోశాధికారిగా ఎస్.చంద్రశేఖర్‌లు ఎన్నికయ్యారు. విజయభాస్కర్ అధ్యక్షుడిగా ఎన్నికవడం ఆరోసారి. నూతన కమిటీకి న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

జాతీయ సమైక్యత శిబిరానికి ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

కేయూ క్యాంపస్: బిలాస్‌పూర్‌లోని గురుఘసిదాస్ సెంట్రల్ యూనివర్సిటీలో ఈ నెల 18నుంచి 24 వరకు జరగనున్న జాతీయ సమైక్యత శిబిరానికి కాకతీయ యూనివర్సిటీ నుంచి పదిమంది ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు హాజరుకానున్నట్లు కేయూ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ఈసం నారాయణ శుక్రవారం తెలిపారు. జాహ్నవి, పల్లవి, ఎం.చందన, పి.మనస్వితి, ఎం.జ్యోత్స్న, బి.కోటేష్, పి.అభిలాష్, ఎ.వంశీ, ధరావత్ సాయికృష్ణ, కె.శ్రీరామ్‌లు ఎంపికయ్యారని వివరించారు. వారికి మేనేజర్‌గా రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎల్.వాల్యానాయక్ వ్యవహరిస్తున్నారు. వారిని వీసీ తాటికొండ రమేష్, రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు తదితరులు అభినందించారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

మడికొండ: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2023–2024సంవత్సరంలో ఐదో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు గడువును ఈ నెల 20వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా కోఆర్డినేటర్ దాసరి ఉమామహేశ్వరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న ఎస్సీ,ఎస్టీ, బీసీ, ఓసీ, మైనార్టీ విద్యార్థిని, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఏప్రిల్ 23వ తేదీన ఉదయం 11 నుంచి 1గంట వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హులైన విద్యార్థిని విద్యార్థులు http://tgoet.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేడు జిల్లాకు భారత్ గౌరవ్ పర్యాటక రైలు



కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌కు శనివారం పూరీ, కాశీ, అయోధ్య ప్రదేశాల పుణ్యక్షేత్ర యాత్ర భారత్ గౌరవ్ పర్యాటక రైలు చేరుకోనుంది. ఈ ప్రత్యేక రైలు సికింద్రాబాద్‌నుంచి శనివారం 12 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 2 గంటలకు కాజీపేట జంక్షన్‌కు చేరుకుంటుంది. జిల్లానుంచి పుణ్యక్షేత్రాలకు తరలివెళ్లే యాత్రికుల కోసం ఇక్కడ మాత్రమే హాల్టింగ్ సౌకర్యం కల్పించారు. ఈ మేరకు పర్యాటక రైలుకు స్వాగతం పలికేందుకు స్థానిక అధికారులు ఏర్పాట్లు చేశారు. కాజీపేటనుంచి 59మంది యాత్రికులు తరలివెళ్లనున్నారు.

కొనసాగుతున్న ఐటీ దాడులు

కాజీపేట రూరల్: కాజీపేటలోని బాలవికాసలో మూడవ రోజు శుక్రవారం కూడా ఐటీ అధికారుల దాడులు కొనసాగాయి. దాడుల్లో స్వాధీనం చేసుకున్న వస్తువులు, ఇతరత్రా వాటిని సిద్దార్థనగర్‌లో గల కార్యాలయానికి తరలించినట్లు తెలిసింది. ఐటీ అధికారులు మీడియాతో మాట్లాడకుండా, బాలవికాస కార్యాలయంలోకి రానివ్వకుండా సీఆర్‌పీఎఫ్ బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు. శనివారం కూడా బాలవికాస కేంద్రంగా తనిఖీలు సాగే అవకాశం ఉందని సమాచారం.

చెదిరిన స్వప్నం!

పొగచూరిన యువ జీవితాలు ● కన్నీళ్లు పెట్టించిన 'స్వప్నలోక్' అగ్ని ప్రమాదం

ఉసురు తీసిన ఉపాధి బాట ● మృతుల్లో ఐదుగురు ఉమ్మడి జిల్లా యువత

సికింద్రాబాద్ స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో చెలరేగిన మంటలు (ఫైల్)



పేదరికాన్ని జయించేందుకు.. జీవితాన్ని నిలబెట్టుకునేందుకు వారంతా భాగ్యనగరం బాటపట్టారు. ప్రతిభను నమ్ముకొని కొలువులో చేరారు. పైసా పైసా కూడబెట్టి తల్లిదండ్రులకు ఆసరాగా ఉంటున్నారు. జీతం ఎంతన్నది కాకుండా.. జీవితాన్ని ఆనందంగా గడుపుతున్నారు. భవిష్యత్ కోసం కలలు కన్నారు. కలల సౌధాల్ని నిర్మించుకున్నారు. ఇంతలోనే విధి వక్రించి వారి కలల మేడల్ని మసి చేసింది. సికింద్రాబాద్‌లోని స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో గురువారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఐదు స్వప్నాలు పొగకు చెదిరిపోయాయి.

– సాక్షి, వరంగల్ /నర్సంపేట రూరల్ /ఖానాపురం / దుగ్గొండి/గూడూరు/కేసముద్రం



ప్రశాంత్‌మృతదేహంపై పడి రోదిస్తున్న తల్లిదండ్రులు, బంధువులు

కల చెదిరింది..



'అమ్మా మన ఊళ్లో వర్షం పడుతుందా? పంట చేలు ఎలా ఉన్నాయి? నాన్న ఏం చేస్తున్నాడు.' అని గురువారం సాయంత్రం తల్లితో మాట్లాడిన ప్రశాంత్ బిజీగా ఉన్నానని ఫోన్ కట్ చేశాడు. కొడుకుతో సరిగ్గా మాట్లాడలేకపోయానని రాత్రి 10 గంటలకు ఫోన్ చేసింది ప్రశాంత్ తల్లి. ఫోన్ కలవలేదు. ఆ తర్వాత కొద్దిసేపటికి బంధువుల ద్వారా విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు కొడుకుతో చివరిగా మాట్లాడిన మాటలు గుర్తు చేసుకుంటూ కుమిలిపోయారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ఇంటికన్నె గ్రామానికి చెందిన అమరాజు జనార్దన్, ఉపేంద్ర దంపతుల కుమారుడు ప్రశాంత్(23). వ్యవసాయ కుటుంబమైన వీరు కొన్నేళ్ల క్రితం కూతురి వివాహం చేశారు. ఒక్కగానొక్క కొడుకును కష్టపడి చదివిస్తూ వచ్చారు. డిగ్రీ పూర్తి చేసిన ప్రశాంత్ ఆర్మీలో ఉద్యోగం సాధించాలని రెండుసార్లు ప్రయత్నించి అపజయం పొందాడు. ఆర్నెళ్ల క్రితం కానిస్టేబుల్ ఉద్యోగానికి శ్రమించి మళ్లీ అపజయాన్ని రుచి చూశాడు. ఈక్రమంలో రెండు నెలలు గ్రామంలో ఉండి మిత్రులకు కోచింగ్ ఇచ్చాడు. జీవితంలో నిలబడేందుకు ఏదో ఉద్యోగం చేయాలని సికింద్రాబాద్‌లోని స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో ఓ కంపెనీలో తండ్రి ఇచ్చిన రూ.2.60 లక్షలు కట్టి ఉద్యోగంలో చేరాడు. అగ్నిప్రమాదంలో ప్రశాంత్ చిక్కుకున్నాడని తెలిసి కన్నీరుమున్నీరయ్యారు. కాగా.. గత శనివారం ఓ వివాహానికి హాజరైన ప్రశాంత్ తల్లిని బైక్‌పై ఎక్కించుకుని ఇంటికి వచ్చాడు. ఆ తర్వాత అదే రోజు సాయంత్రం రైల్లో హైదరాబాద్‌కు వెళ్లాడు. ఆ జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ తల్లిదండ్రులు రోదించిన తీరు అందరినీ కలిచివేసింది.

స్థిరపడ్డాక పెళ్లి చేసుకుంటానని..



శ్రావణి మృతదేహంపై పడి రోదిస్తున్న కుటుంబ సభ్యులు



వరంగల్ జిల్లా ఖానాపురం మండల కేంద్రానికి చెందిన బానోతు నరసింహ, పద్మ అలియాస్ రాంబాయి దంపతుల మొదటి కుమార్తె బానోతు శ్రావణి (22). కోదాడలోని ఓ కళాశాలలో బీటెక్ పూర్తి చేసిన ఆమె ఆర్నెళ్ల క్రితం స్వప్నలోక్ కాంప్లెక్స్‌లోని ఓ కంపెనీ కాల్ సెంటర్‌లో ఉద్యోగం సాధించింది. తల్లిదండ్రులు పెళ్లి చేస్తామంటే 'ఉద్యోగం చేస్తున్నానని.. జీవితంలో సిరపడ్డాక చేసుకుంటానని' చెప్పింది. చిన్న ఇల్లు తప్ప మరేమీ ఆస్తి లేని వీరి కుటుంబం నాలుగేళ్ల క్రితం బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వలస వెళ్లింది. అక్కడే హోటల్‌లో పని చేసుకుంటూ శ్రావణి కుటుంబం జీవనం సాగిస్తోంది. తమ్ముడు, చెల్లి చదువుల కోసం, కుటుంబానికి ఆసరాగా ఉండేందుకు శ్రావణి ఉద్యోగం చేస్తూ వస్తోంది. ఈక్రమంలో గురువారం జరిగిన ఘటనలో శ్రావణి మృతితో ఆ కుటుంబంలో, ఖానాపురంలోని టీకులతండాలో విషాదం నెలకొంది.

అదే చివరి విష్..



శివ ఇంటివద్ద రోదిస్తున్న కుటుంబీకులు



నర్సంపేట మండలం చంద్రయ్యపల్లికి చెందిన ఉప్పుల రాజు, రజిత దంపతుల కుమారుడు శివ(22) అగ్ని ప్రమాదానికి ఆహుతయ్యాడు. మేస్త్రీగా పని చేస్తున్న రాజు తనకున్న ఎకరం భూమితో పాటు మరికొంత భూమిని కౌలుకు తీసుకొని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తల్లిదండ్రుల కష్టాల్ని చిన్నప్పటి నుంచి చూసిన శివకు వారి కోసం ఏదైనా చేయాలని ఉండేది. రూ.1.50 లక్షలు చెల్లిస్తే కమీషన్ల రూపంలో నెలకు రూ.20 వేలు వస్తాయని తెలిసినవారు అతడికి చెప్పారు. అలా మూడేళ్ల క్రితం స్వప్నలోక్ కాంప్లెక్స్‌లోని ఓ మల్టీలెవల్ మార్కెటింగ్ (ఈకామర్స్ బిజినెస్)లో చేరాడు. ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ చదువుతున్నాడు. ఇప్పటి వరకు కమీషన్లు రాలేదు. కానీ.. రెండుసార్లు బెంగళూరు టూర్‌కు తీసుకెళ్లారు. నర్సంపేటలో డిగ్రీ చదువుతున్న శివ చెల్లి సింధు బర్త్ డే ఈనెల 15న బుధవారం ఉండడంతో అదే రోజు శివ ఇంటికి ఫోన్ చేసి చెల్లికి శుభాకాంక్షలు చెప్పాడు. దీంతో సింధు 'అన్నయ్య ఇంటికి రావొచ్చు కదా' అంటే.. 'ఉగాది పండుగకు వస్తాలే' అని శివ అన్నాడు. పక్కనే ఉన్న తల్లితో.. గంటసేపు మాట్లాడాడు. 'నిన్ను చూడబుద్ధి అయితంది బిడ్డా.. జర వీడియో కాల్ చేయరాదు' అని తల్లి రజిత అనడంతో 'ఫ్రీ అవ్వగానే ఓ గంట తర్వాత చేస్తా' అని శివ అన్నాడు. అవే అతడి చివరి మాటలయ్యాయని తల్లి రజిత, చెల్లి సింధు విలపించడం కన్నీరు పెట్టించింది.

ఆ ఇంటి 'వెన్నెల' ఆరిపోయింది!



విలపిస్తున్న తల్లిదండ్రులు



వెన్నెల(ఫైల్)

దుగ్గొండి మండలం మల్లంపల్లి గ్రామానికి చెందిన వంగ రవి, లక్ష్మీ దంపతుల కుమార్తె వెన్నెల(22). రవికి రెండెకరాల భూమి ఉంది. మరికొంత భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. రెండేళ్ల క్రితం డిగ్రీ పూర్తి చేసిన వెన్నెల హైదరాబాద్‌లోని స్వప్నలోక్ కాంప్లెక్స్‌లోని ఈకామర్స్ సెంటర్‌లో ఉద్యోగం చేస్తోంది. సంక్రాంతి పండుగ సందర్భంగా ఇంటికి వచ్చిన వెన్నెల కుటుంబ సభ్యులతో కలిపి సంతోషంగా గడిపింది. తిరిగి డ్యూటీకి వెళ్లింది. అనుకోకుండా జరిగిన అగ్ని ప్రమాదంలో ఊపిరాడక మృతి చెందింది. 'అమ్మాయే అయినప్పటికీ చిన్నప్పటి నుంచీ పట్టుదలతో చదివేది. అన్నింట్లో ముందుండేది. ఉద్యోగం సాధించాక మొదటి ఏడాది ట్రెయినింగ్‌లో భాగంగా తన ఖర్చులు తాను చూసుకుంది. ఏడాది నుంచి నెలకు రూ.30 వేల వేతనం వస్తుండడంతో పొదుపుగా ఖర్చు చేసి తనకు నెలకు రూ.20 వేలు పంపేది' అని వెన్నెల తండ్రి రవి బోరున విలపించాడు. 'వచ్చే ఏడాది నా చెల్లెలి కుమారుడికి వెన్నెలను ఇచ్చి పెళ్లి చేద్దామనుకున్నా. ఇంతలోనే ఇలా జరిగింది. మా ఇంట్లో చీకట్లు అలుముకున్నాయి' అని వెన్నెల తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

ఆశ ఆవిరైంది..



రోదిస్తున్న ప్రమీల తల్లి బుజ్జి, తండ్రి భద్రు



ప్రమీల (ఫైల్)

మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం ఎర్రకుంటతండా శివారు సురేశ్‌నగర్‌కు చెందిన జాటోతు భద్రు, బుజ్జి కుమార్తె ప్రమీల(23). ఒక్కగానొక్క కూతురిని తల్లిదండ్రులు కూలీ చేసి బీటెక్ చదివించారు. ఏడాది కాలంగా ప్రమీల క్యూ నెట్ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. కుమార్తెకు పెళ్లి చేయాలనుకున్న తల్లిదండ్రులు ఏడాగా ఆమెను అడుగుతున్నారు. ఈసంవత్సరం పెళ్లి చేయాలనుకున్న తల్లిదండ్రులు సంబంధాలు చూస్తూ వస్తున్నారు. ప్రమీల సైతం రోజూ తల్లిదండ్రులకు ఫోన్ చేస్తోంది. ఫోన్ కాల్ వస్తే ఆనందంతో ఆ తల్లిదండ్రుల కళ్లు వెలిగిపోయేవి. కానీ గురువారం రాత్రి 11 గంటల సమయంలో వచ్చిన ఫోన్ కాల్ గుండెల్లో రైళ్లు పరిగెట్టించింది. 'మీరు ప్రమీల తల్లి బుజ్జినా.. మీ కూతురు ప్రమీల సికింద్రాబాద్‌లో ఉద్యోగం చేస్తున్న భవనంలో మంటలు చెలరేగాయి. ఏం జరగలేదు. మీతో ఎవరైనా ఉన్నారా?' అని అడిగారు. పక్కింటి వ్యక్తికి ఫోన్ ఇవ్వగానే.. 'ప్రమీలకు గాయాలయ్యాయి. ఆమె తల్లిదండ్రులకు చెప్పి రమ్మనండి' అనేసరికి ఆ తల్లిదండ్రులు కళ్ల జలధారల్లా కారుతూనే ఉన్నాయి. చివరికి తమ కూతురు చనిపోయిందని తెలుసుకున్న తల్లిదండ్రుల ఆర్తనాదాలు గాంధీ ఆస్పత్రిలో ప్రతిధ్వనించాయి.

ఉద్యోగ ఆశ ఊపిరి తీసింది..
- డబ్బులు చెల్లిస్తేనే ఉద్యోగాలు
- లింక్ సిస్టంతో పరేషాన్ ఉద్యోగం
- స్వప్నలోక్ ఘటనతో వెలుగులోకి ఆసక్తికర విషయాలు

- వివరాలు IIలో



ఉట్టిపడిన సంప్రదాయం

గ్రేటర్ వరంగల్ శివారులోని ఎస్సార్ యూనివర్సిటీలో స్పార్కిల్–23 వేడుకల్లో భాగంగా శుక్రవారం విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో అలరించారు.
- 11లో - హసన్‌పర్తి

రైతులను ఆందోళనకు గురిచేస్తున్న అకాల వర్షం

హన్మకొండ: అకాల వర్షాలు అన్నదాతను ఆందోళనకు గురిచేస్తున్నాయి. పంటలు కీలక దశలో ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో వర్షం, వడగళ్ల సూచనలు రైతుకు నిద్రపట్టనివ్వడం లేదు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో వడగళ్లు, ఓ మోస్తరు వర్షం కురిసింది. హనుమకొండ జిల్లాలో మాత్రం అంతగా ప్రభావం లేదు. శుక్రవారం తెల్లవారు జామున ముసురు పడింది. ప్రధానంగా వరి కొన్ని చోట్ల చిరుపొట్ట, పొట్టదశతోపాటు మరికొన్ని చోట్ల వరి కంకులు బయటకు వచ్చాయి. ఈ దశలో వడగళ్లు పడినా, ఓ మోస్తరు వర్షం కురిసినా వరి పడిపోయి తీవ్ర నష్టం వాటిల్లే అవకాశముందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొక్కజొన్న పైరుదీ ఇదే పరిస్థితి. కూరగాయల పంటలకు నష్టం వాటిల్లనుంది. వాతావరణ శాఖ మరో నాలుగు రోజులపాటు వడగళ్లతోపాటు మోస్తరు వర్షం కురిసే అవకాశముందని చెబుతోంది.

500మంది గైర్హాజరు

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలో శుక్రవారం జరిగిన ఇంటర్ ఫస్టియర్ పరీక్షలకు 500మంది గైర్హాజరయ్యారు. జిల్లాలో 49 కేంద్రాల్లో పరీక్షలు జరగగా, జనరల్, ఒకేషనల్ కోర్సులు కలిపి 18,932మందికి 18,432మంది విద్యార్థులు హాజరైనట్లు డీఐఈఓ గోపాల్ తెలిపారు.

సభలో అభివాదం చేస్తున్న సీతారాం ఏచూరి, చిత్రంలో తమ్మినేని, కూనంనేని తదితరులు



ప్రజా.. జాగృతానికి జనచైతన్యయాత్ర
- జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చేతుల మీదుగా ప్రారంభం
- వరంగల్, హనుమకొండలలో బహిరంగసభలనుంచి శ్రీకారం

- వివరాలు IIలో

సకాలంలో రుణాలు అందించాలి : కలెక్టర్

హన్మకొండ అర్బన్: బ్యాంకులు సకాలంలో రుణాలు అందించి ప్రభుత్వ లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్.. బ్యాంకర్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాస్థాయి బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ (డీసీసీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంట రుణాలు, అనుబంధ రంగాల రుణాల కింద మొత్తం రూ.4,444.46 కోట్లు లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. రైతులకు గత డిసెంబర్ వరకు పంట, దీర్ఘకాలిక రుణాలు కలిపి వ్యవసాయ రంగానికి మొత్తం రూ.2,131.18 కోట్లు బ్యాంకుల ద్వారా ఇచ్చినట్లు తెలిపారు. వ్యవసాయ రుణాలను సకాలంలో అందించి లక్ష్యాలను సాధించాలని, రైతులు సకాలంలో చెల్లించేలా అధికారులు క్షేత్రస్థాయిలో శ్రద్ధ కనబర్చాలని ఆదేశించారు. సూక్ష్మ రుణాల కింద సూక్ష్మ, చిన్న, మధ్య స్థాయి పరిశ్రమలకు రూ.1,156.83 కోట్లు, విద్యా రుణాలు రూ.16.07 కోట్లు, గృహ రుణాలుగా రూ.39.55 కోట్లు అందించినట్లు వివరించారు. అంతేకాకుండా ప్రాధాన్యతా రంగాలకు రూ.3,375.59 కోట్లు అందించారన్నారు. జిల్లాలో మహిళా సంఘాలకు రూ.469కోట్ల రుణాలు లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. దీనిలో ఇప్పటివరకు సంఘాలకు రూ.349 కోట్లు అందించి 74శాతం లక్ష్యాన్ని సాధించినట్లు తెలిపారు. అర్హత ఉన్న సంఘాలకు రుణాలు వెంటనే అందించాలని, రెన్యువల్‌లో ప్రాసెసింగ్ ఫీజు లేకుండా చూడాలని తెలిపారు. మెప్మా ద్వారా 476 సంఘాలకు రుణాలు అందించారన్నారు. వీధి వ్యాపారులకు అందించే రూ.20వేల రుణానికి సంబంధించి జిల్లాలో 6,134 మంది వ్యాపారులకుగాను ఇంకా 1,866 మందికి లోన్ పెండింగ్‌లో ఉందని, వీటిలో ప్రధాన బ్యాంకులైన ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకులు కూడా ఉండడం శోచనీయమన్నారు. పీఎం ఈజీపీ కింద 46 యూనిట్లకు మాత్రమే లోన్లు మంజూరు చేయడం పట్ల కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే క్షమించేది లేదని హెచ్చరించారు. అటల్ పెన్షన్ యోజన కింద 41 వేల పెన్షన్లు ఎన్‌రోల్ అయ్యాయని, పీఎం జీవన జ్యోతి యోజన ద్వారా 74,648 మంది సభ్యులకు ఇన్సూరెన్స్ కల్పించినట్లు తెలిపారు. బ్యాంకు అధికారులు.. వారి బ్యాంకు ప్రగతి నివేదికలను ప్రతి 15 రోజులకు ఒకసారి కచ్చితంగా సమర్పించాలన్నారు. సమావేశంలో ఎల్‌డీఎం శ్రీనివాస్, నాబార్డ్ డీడీఎం చంద్రశేఖర్, ఆర్‌బీఐ ఏజీఎం అనిల్, డీఆర్‌డీఓ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు హరిప్రసాద్, శ్రీనివాస్, మాధవిలత, ప్రేమకళారెడ్డి, రామ నర్సయ్య, విజయభారతి, భద్రు, వి.సురేష్‌బాబు, జి.శ్రీధర్‌రెడ్డి, రంజిత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

బీజేపీ అధికారంలోకి వస్తే నాశనమే

మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

హన్మకొండ: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే రాష్ట్రం నాశనమవుతుందని, వరంగల్ మహానగరంలో గెలిస్తే నగర అభివృద్ధి కుంటుపడుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శుక్రవారం హనుమకొండ హంటర్ రోడ్డు సహకారనగర్‌లోని విష్ణుప్రియ గార్డెన్స్‌లో బీఆర్‌ఎస్ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కార్యకర్తల, 23న జరిగే బీఆర్‌ఎస్ బహిరంగ సభ సన్నాహక సమావేశం జరిగింది. సమావేశంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రజల కోసం పనిచేసే వారిని గుర్తించాలని, గుర్తుపెట్టుకోవాలన్నారు. ఈ నెల 23న ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ పాల్గొనే బీఆర్‌ఎస్ బహిరంగ సభను విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. డైనమిక్ లీడర్ దాస్యం వినయ్‌భాస్కర్‌ను కాపాడుకోవాలన్నారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ వచ్చే ఆరు నెలలు కీలకమని, ఈ ఆరు నెలలు రాజకీయాలే మాట్లాడాలని, ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ఇప్పటికే కార్యకర్తలకు అవకాశాలు కల్పించామని, రాబోయే రోజుల్లో మరికొందరికి నామినేటెడ్ పదవులు కల్పిస్తామన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే దోనేపూడి రమేష్ బాబు, మాజీ ఎమ్మెల్యే పద్మ, రుణ విమోచన కమీషన్ చైర్మన్ నాగూర్ల వెంకటేశ్వర్లు, వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి, కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్ రాజు యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్, టీజీఏ రాష్ట్ర అధ్యక్షుడు మర్రి యాదవ రెడ్డి, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, పక్కన వినోద్‌కుమార్, వినయ్‌భాస్కర్

'అట్రాసిటీ'ని సమర్థంగా అమలు చేయండి

వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్ రూరల్: వరంగల్ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని సమర్థంగా అమలు చేయాలని అధికారులను కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అట్రాసిటీ కేసులపై జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. జిల్లాలో 27 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటి దర్యాప్తు త్వరగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో సెంట్రల్ డీసీపీ బారి, ఈస్ట్‌జోన్ డీసీపీ కరుణాకర్, జిల్లా వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ ఉషాదయాళ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆసక్తి కలిగేలా విద్యాబోధన జరగాలి

వరంగల్ ఆర్‌జేడీ కె సత్యనారాయణ రెడ్డి

ఐనవోలు: విద్యార్థులకు ఆసక్తి కలిగేలా విద్యాబోధన జరగాలని వరంగల్ పాఠశాల విద్యా ప్రాంతీయ సంచాలకులు (ఆర్‌జేడీ) కె.సత్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కక్కిరాలపల్లి ప్రభుత్వ పాఠశాలలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా పదవ తరగతి విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. ఉపాధ్యాయులు పూర్తిగా సహకరించాలని, వందశాతం ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు. వివిధ తరగతుల విద్యార్థులతో సంభాషించి వారి పఠనాసక్తిని పరిశీలించారు. ప్రాథమిక పాఠశాలను సందర్శించి ఎఫ్‌ఎల్‌ఎన్ అమలవుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అక్షర దోషం లేకుండా బోధన చేయాలని ఉపాధ్యాయులను కోరారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై అకాడమిక్‌కు సంబంధించిన పలు అంశాలను చర్చించి వారికి సలహాలు సూచనలు చేశారు. మన ఊరు–మన బడి పనులను పరిశీలించారు. విద్యుదీకరణ పనులు పూర్తయ్యాయని, కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులు జరుగుతున్న విషయాన్ని హెచ్‌ఎం రామకృష్ణ తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కంజర్ల రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్‌జేడీ

క్లుప్తంగా

చేపల పెంపకంతో ఆర్థిక పురోగతి


సర్టిఫికెట్ అందజేస్తున్న డాక్టర్ రాజన్న

కరీమాబాద్: రైతులు వ్యవసాయానికి అనుబంధంగా చేపల పెంపకం చేపట్టాలని కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాజన్న అన్నారు. మామునూరు కేవీకే, పీవీ నరసింహారావు పశు వైద్య విశ్వవిద్యాలయం, జాతీయ మత్స్య అభివృద్ధి మండలిల ఆధ్వర్యంలో మిశ్రమ చేపల పెంపకంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజన్న మాట్లాడుతూ.. రైతులు స్వయం ఉపాధిగా చేపల పెంపకాన్ని చేపట్టాలని సూచించారు. నిరుద్యోగ యువత వ్యవసాయ అనుబంధంగా శాస్త్రీయ పద్ధతిలో చేపల పెంపకం చేపట్టి అదనపు ఆదాయం పొందాలని సూచించారు. హనుమకొండ జిల్లా మత్స్యశాఖ అధికారి డాక్టర్ భారతి మాట్లాడుతూ చేపల పెంపకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయన్నారు. జనగామ జిల్లా మత్స్య శాఖ అధికారి నాగులు మిశ్రమ చేపల పెంపకంలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ గణేశ్, డాక్టర్ రాజు, డాక్టర్ శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కకు భయపడితే చేయి విరిగింది..!



కాజీపేట: ఓ పిచ్చికుక్క బారి నుంచి తప్పించుకోవడానికి ఓ బాలుడు పరుగెత్తుతూ కిందపడడంతో చేయి విరిగిన ఘటన శుక్రవారం కాజీపేట పట్టణం బాపూజీనగర్‌లో చోటుచేసుకుంది. బాలుడి తండ్రి ఎండీ భాషు మియా తెలిపిన వివరాల ప్రకారం.. ముస్తాఫా (9) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు వెళ్లి ఇంటికి వస్తుండగా ఓ కుక్క వెంటపడింది. భయంతో పరుగులు పెట్టిన బాలుడు రహదారిపై కిందపడిపోవడంతో ఎడమ చేయి విరిగింది. రోడ్డుపై వెళ్తున్నవారు బాలుడిని రక్షించారు.

బాలుడిపై వీధి కుక్క దాడి



రామన్నపేట : వరంగల్ నగరంలోని 22వ డివిజన్ ఫస్ట్ బ్యాంక్ కాలనీలో ఆరు సంవత్సరాల బాలుడు జశ్వంత్‌పై శుక్రవారం సాయంత్రం వీధికుక్క దాడిచేసింది. రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న జశ్వంత్‌పై ఎదురుగా వస్తున్న వీధి కుక్క ఒక్కసారిగా దాడి చేసి కుడి చేతిపై తీవ్రంగా గాయపరిచింది.

ఉద్యోగ ఆశ ఊపిరి తీసింది

- డబ్బులు చెల్లిస్తేనే ఉద్యోగాలు
- లింక్ సిస్టంతో పరేషాన్ ఉద్యోగం
- 'స్వప్నలోక్' ఘటనతో వెలుగులోకి ఆసక్తికర విషయాలు



నర్సంపేట: పేద మధ్యతరగతి కుటుంబాల్లోని యువతకు ఉద్యోగం జీవిత లక్ష్యం. చదివిన చదువుకు తగ్గట్టుగా ఉద్యోగాలు రానిపరిస్థితిలో అందివచ్చిన అవకాశాన్ని వదిలేయలేక ఎంత కష్టమైనా కుటుంబ పోషణకు ఏదో ఉద్యోగం చేస్తుంటారు. ఇందులో భాగంగా నర్సంపేట నియోజకవర్గంలోని పలువురు యువత ముందే సంస్థకు కొంత డబ్బులు చెల్లించి ఉద్యోగంలో చేశారు. ఇక తమ జీవితాలు స్థిరపడినట్లే.. తమ కుటుంబాలకు సైతం ఆర్థిక భరోసా కలిగినట్లే అనుకున్నారు. కానీ ఉద్యోగంలో చేరాక తెలిశాయి వారి కష్టాలు. కష్టాలను ఓర్చుకుంటూ సైతం కుటుంబ పరిస్థితులకు అనుగుణంగా ఉద్యోగం చేయాలనుకున్నారు. వారు కట్టిన డబ్బులను తిరిగి రాబట్టుకునేందుకు ఉద్యోగ విధులు నిర్వర్తిస్తూ.. సికింద్రాబాద్‌లో గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో ప్రాణాలొదిలారు. స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో జరిగిన భారీ అగ్ని ప్రమాదంలో నర్సంపేట నియోజకవర్గంలోని ఖానాపురానికి చెందిన బానోత్ శ్రావణి, దుగ్గొండి మండలం మల్లంపల్లి గ్రామానికి చెందిన వంగ వెన్నెల, నర్సంపేట మండలం చంద్రయ్యపల్లి గ్రామానికి చెందిన ఉప్పుల శివ మృతి చెందారు. వీరి మృతితో ఆయా గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. వీరు పని చేస్తున్న చోట విచిత్ర పరిస్థితుల నడుమ ఉద్యోగాన్ని చేస్తున్నట్లు తెలిసింది. ఆ ఉద్యోగంలో ఉన్న పరిస్థితులతో పలువురు ఉద్యోగాలను వదిలేసి ఇంటి బాట పట్టినట్లు తెలుస్తుంది. ఉద్యోగం చేయాలంటే ముందస్తుగా రూ.లక్ష80వేల నుంచి రూ.3లక్షల వరకు సంబంధిత సంస్థకు చెల్లించాల్సి ఉంటుంది. చేరిన తర్వాత నెల నెలా జీతాలు రాలేని దుర్భర పరిస్థితి. వీరు చేసే ఉద్యోగం చైన్ సిస్టం వలే ఉంటుందని అందులో పని చేసిన మరికొంత మంది చెబుతున్నారు. జీతం రావాలంటే ఒకరి ద్వారా మరొకరిని సంస్థలో చేర్పించాల్సి ఉంటుంది. చేర్పించిన 15రోజుల తర్వాత డబ్బులు వారికి చెందుతాయి. ఇలా అనేక మంది ముందస్తుగా డబ్బులు చెల్లించి సంస్థలో చేరినట్లు తెలుస్తుంది. వారు కట్టిన డబ్బులు కూడా జీతం రూపంలో రాలేదని సంస్థ నుంచి బయటకు వచ్చిన పలువురు చెబుతున్నారు. నియోజకవర్గానికి చెందిన ఓ యువతి రూ.1.80లక్షలు చెల్లించి సంస్థలో చేరింది. చేరిన తర్వాత వారు చెప్పిన ఉద్యోగ పరిస్థితులను తట్టుకోలేక బయటకు వచ్చింది. డబ్బులు వెనక్కి ఇవ్వాలని కోరగా.. మాకు ప్రభుత్వ అనుమతులు ఉన్నాయి.. ఏదైనా ఉంటే లాయర్ ద్వారా చూసుకోవాలంటూ ఎదురు తిరగడంతో చేసేదేమి లేక బయటకు వచ్చింది. బయటకు వచ్చిన తర్వాత సంస్థపై మరింత ఒత్తిడి పెంచడంతో రూ.లక్ష ఇచ్చి మిగతావి ఇవ్వకుండానే తప్పించుకున్నారు. ఇలా ఎంతో మంది తెలియక సంస్థలో చేరి తమ జీవితాలను పణంగా పెట్టి ఇబ్బందులు పడి బయటకు వచ్చిన వారు నర్సంపేట నియోజకవర్గంలో చాలా మంది ఉన్నట్లు తెలుస్తుంది. ఇంతలో కాంప్లెక్స్‌లో జరిగిన ప్రమాదంతో ఒక్కొక్కటిగా నిజాలన్నీ బయటకు వస్తున్నాయి.

చెల్లించిన డబ్బులు కూడా రాలేదు



సంస్థలో 2022 ఏప్రిల్‌లో చేరేటప్పుడు రూ.1.80లక్షలు కట్టాను. సంస్థలో చేరిన తర్వాత ఒక్కొక్కరిని చేర్పించాలనే నిబంధన పెట్టారు. దీంతో కొంత కాలం చేశాను. ఆ తర్వాత ఇబ్బందిగా ఉండడంతో బయటకు వచ్చాను. కట్టిన డబ్బులు ఇవ్వమని అడిగితే కేసులు పెట్టుకో, లాయర్ వద్దకు వెళ్లమంటూ ఇబ్బంది పెట్టారు. సంస్థపై తీవ్ర ఒత్తిడి తేవడంతో రూ.1లక్ష మాత్రమే చెల్లించారు. మిగతావి చెల్లించకుండానే వదిలేశారు. నాతో పాటు పని చేసి ప్రస్తుతం పని చేస్తున్న శ్రావణి రూ.3లక్షలు కట్టింది.

– బానోత్ వినోద, ఖానాపురం

ఏడ్చిన సందర్భాలు అనేకం



సంస్థలో చేరే సమయంలో రూ.1.80లక్షలు కట్టాను. సంస్థలో చేరిన తర్వాత పలువురిని చేర్పిస్తేనే జీతాలు వస్తాయని తెలుపడంతో కొంత కాలం ఇబ్బంది పడ్డాం. ఆ తర్వాత బయటకు వచ్చాను. డబ్బులు ఇవ్వాలని అడిగితే ఇబ్బంది పెట్టారు. ఇప్పటికీ డబ్బులు కోసం ఏడ్చుకుంటూ ఉన్న సందర్భాలు ఉన్నాయి. అగ్ని ప్రమాదంలో పలువురు మృతిచెందడం బాధాకరం. అధికారులు, ప్రభుత్వ పెద్దలు స్పందించి మాకు రావాల్సిన డబ్బులు ఇప్పించాలి.

– రచన, మగ్దుంపురం, నర్సంపేట

ప్రీతి కుటుంబాన్ని ఆదుకుంటాం..

- పార్టీ పరంగా సహాయం అందజేసిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

కొడకండ్ల: మెడికో విద్యార్థి ధరావత్ ప్రీతి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు శుక్రవారం కొడకండ్ల మండలం గిర్నితండాలో ప్రీతి కుటుంబసభ్యులను కలిసిన మంత్రి.. ప్రీతి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. పార్టీ పరంగా, ఇచ్చిన హామీ మేరకు తనవంతు సాయంగా రూ.20 లక్షలు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రీతి కుటుంబాన్ని ఆదుకునేందుకు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, తానూ ఆలోచిస్తున్నామని చెప్పారు. ఇ కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగ కల్పనపై కూడా ఆలోచిస్తున్నామని వివరించారు. ప్రీతి తల్లి శారద మాట్లాడుతూ కూతురు లేని లోటును ఎవరూ తీర్చలేరని, ఇలాంటి ఘటన మరొకటి జరగకుండా దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు.


ప్రీతి కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న ఎర్రబెల్లి

నాగజ్యోతి కుటుంబానికి పరామర్శ

హనుమకొండలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతూ ఆత్మహత్య చేసుకున్న మురారిశెట్టి నాగజ్యోతి కుటుంబ సభ్యులను మండలంలోని ఏడునూతుల గ్రామంలో మంత్రి పరామర్శించారు. మృతురాలి తండ్రి బీఆర్ఎస్ కార్యకర్త ఎలికట్టే వెంకన్నతోపాటు కుటుంబ సభ్యులను ఆయన ఓదార్చారు. మంత్రి వెంట ఎంపీపీ జ్యోతి, జెడ్పీటీసీ సత్తమ్మ, ఈజీఎస్ డైరెక్టర్ అందె యాకయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సిందె రామోజీ, సతీష్‌గౌడ్, సర్పంచ్‌లు రాజ్‌కుమార్, మహేష్‌నాయక్, మధుసూదన్ పాల్గొన్నారు.

వరంగల్ గ్రంథాలయ సంస్థ చైర్మన్ కన్నుమూత


బొచ్చు వినయ్(ఫైల్)

పరకాల: పరకాల పట్టణానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, వరంగల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొచ్చు వినయ్ (49) గత కొంత కాలంగా కిడ్నీలు చెడిపోవడంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన వినయ్ సేవలను గుర్తించిన సీఎం కేసీఆర్ 2017లో వరంగల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవికట్టబెట్టారు. కాగా, వినయ్ మృతి వార్త తెలుసుకొన్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి హాస్పటల్‌కి వెళ్లి ఆయన మృతదేహాన్ని సందర్శించి తన ప్రగాఢ సంతాపం తెలిపారు. శనివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

'పెద్ద'ది చేశారా... జరిగిందా..

- డీసీపీఓ మహేందర్‌రెడ్డి వేటుపై జిల్లాలో వివాదం
- కావాలనే బలి పశువును చేశారా, లైంగిక ఆరోపణలు నిజమా
- తాజాగా జరుగుతున్న పరిణామాలతో జిల్లాలో పెద్ద చర్చ
- ముఖ్యనేతలనుంచి ప్రాణహాని ఉందని సీఎం కేసీఆర్‌కు మహేందర్‌రెడ్డి తల్లిదండ్రులు లేఖ
- అవి నిజం కావంటూ బీఆర్‌టీయూ మహిళ నేత భారతి ఖండన
- పరిధి దాటిన ఆమెపై చర్యలు తీసుకోవాలన్న మహేందర్‌రెడ్డి

సాక్షి, వరంగల్: వరంగల్ జిల్లా బాలల సంక్షేమ అధికారి గాదె మహేందర్‌రెడ్డి ఉద్యోగం తొలగింపు 'పెద్ద'రాజకీయ దుమారాన్నే లేపుతోంది. సహోద్యోగైన మహిళ చేసిన లైంగిక వేధింపుల ఫిర్యాదుతో ఆయనను సదరు కాంట్రాక్ట్ ఉద్యోగంనుంచి రిలీవ్ చేసిన ఉన్నతాధికారులు...ఏమాత్రం నియమ నిబంధనలు పాటించకుండా ఏకపక్ష విచారణతో మమ అనిపించారని...ఇందులో ముఖ్య రాజకీయ నేతల ఒత్తిళ్లు ఉన్నాయన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. దీనికి బలం చేకూరుస్తూ.. తాను ఏ తప్పూ చేయలేదని...నన్ను ఉద్యోగం నుంచి ఎందుకు తొలగించారనేందుకు వారి వద్ద ఉన్న విచారణ నివేదికను అడిగినా ఇవ్వడం లేదంటూ హైకోర్టులో ఇప్పటికే మహేందర్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేసి న్యాయ పోరాటం చేస్తున్నారు. ఇంకోవైపు ఆయన తల్లిదండ్రులు గాదె చిన్న కృష్ణారెడ్డి, సావిత్రమ్మ ఏకంగా సీఎం కేసీఆర్‌కు లేఖ రాస్తూ.. తమ కొడుకుకు ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, వికలాంగుల కమిషన్ చైర్మన్ వాసుదేవరెడ్డిల నుంచి ప్రాణభయం ఉందని ప్రస్తావించడంతో ఒక్కసారిగా నర్సంపేట రాజకీయం వేడెక్కింది. దీనిపై ఇప్పటివరకు ఎమ్మెల్యే ఎక్కడా పెదవి విప్పకపోయినా.. భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ శ్రామిక మహిళ రాష్ట్ర నాయకురాలు, నర్సంపేటలో అంగన్‌వాడీ టీచర్ నల్లా భారతి ఆయనపై వచ్చిన ఆరోపణలను గురువారం ఖండించారు. ఐసీడీఎస్‌లో పనిచేస్తున్న తన తోటి ఉద్యోగిని తనను మహేందర్‌రెడ్డి లైంగికంగా వేధిస్తున్నాడని కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో శాఖాపరమైన విచారణ చేసి చర్యలు తీసుకున్నారని, ఇందులో ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పాత్ర ఉందని చెప్పడంలో నిజంలేదన్నారు. ఇదిలా ఉండగా మహేందర్ రెడ్డిని వేధిస్తున్నాడంటూ, భయపెట్టిస్తున్నాడంటూ బాధితురాలు పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను కలిసినట్టు తెలిసింది.

జనవరి 23న రిలీవ్...అదే రోజు ఎఫ్ఐఆర్

హరిత కలెక్టర్‌గా ఉన్న సమయంలో రాయపర్తిలో జరిగిన ఓ బాల్యవివాహం కేసులో డయల్ 1098కు ఫోన్ కాల్ చేసిన వారి వివరాలను జిల్లా బాలల సంరక్షణ విభాగంలో పనిచేస్తున్న ఓ ఉద్యోగిని బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో ఆమెకు మెమో జారీ చేశారు. ఆ వెంటనే డీసీపీఓ మహేందర్ రెడ్డి వేధిస్తున్నాడంటూ సదరు మహిళా ఉద్యోగి.. కలెక్టర్ హరితకు 2021 జనవరిలో ఫిర్యాదుచేయడంతో విచారణ చేశారు. ఏమైందో తెలియదు గానీ...కొందరు 'ముఖ్య'నేతల ఒత్తిడితో ఆ నివేదిక అటకెక్కింది. ఫిర్యాదు చేసిన వారిది తప్పా...లేదంటే డీసీపీఓది తప్పా అనేది తేలలేదు. అప్పుడు ఎవరిపైనా చర్యలు తీసుకోలేదు. కలెక్టర్ గోపి వచ్చాక మళ్లీ అదే మహిళ లైంగికంగా వేధిస్తున్నాడంటూ గతేడాది డిసెంబర్ 29న ఫిర్యాదు చేయడంతో జనవరి నాలుగున ఓ కమిటీ వేసి విచారణ చేసి మహేందర్ రెడ్డిని ఉద్యోగం నుంచి జనవరి 23న రిలీవ్ చేస్తూ ఆదేశాలిచ్చారు. అదేరోజు సదరు మహిళ హనుమకొండ పోలీస్‌స్టేషన్‌లో మళ్లీ మహేందర్‌రెడ్డి లైంగిక వేధిస్తున్నాడంటూ, బెదిరిస్తున్నాడంటూ ఫిర్యాదు చేశారు. అయితే దీని వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయని, నెక్కొండలో శిశు విక్రయాలు అడ్డుకునేందుకే ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఇలా చేయించారని మహేందర్‌రెడ్డి తల్లిదండ్రులు సీఎం కేసీఆర్‌కు లేఖ రాయడం జిల్లా రాజకీయాల్లో పెద్ద చర్చకు దారి తీసింది.

నల్లా భారతిపై చర్యలు తీసుకోండి

కలెక్టర్, మంత్రికి మహేందర్‌రెడ్డి ఫిర్యాదు

వరంగల్ డీసీపీఓగా పనిచేసి రిలీవ్ అయిన మహేందర్‌రెడ్డి నర్సంపేటకు చెందిన అంగన్‌వాడీ టీచర్ నల్లా భారతిపై వరంగల్ కలెక్టర్, కమిషనర్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రికి శుక్రవారం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. తనకు ఏమాత్రం సంబంధం లేని విషయంలో నర్సంపేటలో మీడియాతో మాట్లాడుతూ.. మహేందర్‌రెడ్డిని లైంగిక ఆరోపణలతో ఉద్యోగం నుంచి తొలగించారని, ఆ ఆరోపణలు నిరూపణ అయ్యాయని చెప్పిందని, ఆ ఆధారాలుంటే బయటపెట్టాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆమె వ్యాఖ్యలతో నా వ్యక్తిగత జీవితానికి భంగం వాటిల్లిందని, ప్రభుత్వ పరిధిలో పనిచేస్తూ, గౌరవ వేతనం తీసుకుంటూ .. వ్యక్తిగత విషయాలను చెప్పిన ఆమెపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

ప్రియుడు ఇంటి ఎదుట దీక్ష

పెద్దవంగర: హనుమకొండలో ఉంటూ వేర్వేరుగా ప్రైవేట్‌గా ఉద్యోగాలు చేసే వారు ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకోవాలని అనుకున్నారు. కానీ, ఇంతలోనే ఆ యువకుడు కన్పించకుండా పోయాడు. దీంతో తనను తప్ప మరెవరినీ పెళ్లి చేసుకోనని పట్టుబట్టిన యువతి సదరు యువకుడి ఇంటి ఎదుట దీక్షకు దిగింది. మానుకోట జిల్లా పెద్దవంగర మండలంలోని ఉప్పరగూడెం గ్రామానికి చెందిన బయన హరిశంకర్ హనుమకొండకు చెందిన అనుశెట్టి సుప్రియ ప్రేమించుకుని, పెళ్లి చేసుకుందామనుకున్న సమయంలో హరిశంకర్ అదృశ్యమయ్యాడు. దీంతో సుప్రియ ప్రియుడి ఇంటిఎదుట శుక్రవారం దీక్షకు దిగింది. న్యాయం జరిగేంత వరకు దీక్ష విరమించేది లేదని పేర్కొంటూ కన్నీటి పర్యంతమైంది.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

LOANS / PLOTS

■ GWMC పరిధిలో 4 వేలకు గజం గల ఓపెన్ ప్లాట్స్ లభించును మరియు అన్నిరకాల లోన్లు కొరకు వెంటనే సంప్ర॥ 9949304722, 9866634088. [W-785459]

పాత ఇల్లు కావాలి

■ 10 లక్షల లోపు విలువ కలిగిన ఇంటి నెంబర్ ఉన్న పాత లేదా కూలిపోయిన ఇల్లు కావాలి. Dispute ఉన్నా, వాస్తు లేకపోయిన, Link Documents లేకపోయిన, కూలిపోయిన చిన్న ఇల్లు అయిన, Road Widening లో ఉన్న పర్వాలేదు. సెల్: 6309013618. [W-775792]

PLOT FOR SALE

■ మడికొండలోని రైల్వే ట్రైన్ అవతల గల కపిల్ హోమ్స్ దగ్గర్లో 622 గం॥ తూర్పు ఫేజ్ స్థలం అమ్మకమునకు కలదు. తక్కువ ధరలో గల స్థలం మీయొక్క భవిష్యత్తు అవసరాలకు అభివృద్ధి చెందుతుంది. సెల్: 9989138487. [W-775794]

■ సుబేదారి నుండి పింగిళి కాలేజి వెళ్లే 60 ఫీట్ రోడ్డు గల మండల ప్రజాపరిషత్ ఎదురూ ఉన్న 680 చ॥గ॥ నార్త్ ఫేసింగ్ ప్లాటు కమర్షియల్ ప్లాటు హాస్పిటల్స్, హోటల్స్‌కి అనుకూలమైనది అమ్మకు. 9985777792 [W-775793]

FLATS FOR SALE

■ KUDA కాలనీ 100 ఫీట్ల రోడ్డుకి, SPR School కు దగ్గరలో Stilt Plus 5 ఫ్లోర్స్ అపార్ట్‌మెంటులో 2&3 BHK Luxury Flats అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-26836]

PROPERTY FOR SALE

■ 374 Sq.yards G+1 House SBH Colony, Near to Collector office NIT Clg, 2 BHK Flats near KUC Cross, Alankar. For more Call: 7989106048. [HA-10422]

HOUSE FOR SALE

■ ఉర్సుగుట్ట నుండి ఖాజీపేట్ వెళ్ళు 150 ఫీట్ల రోడ్డు ప్రక్కన, భట్టుపల్లి SR Prime Schoolకు ఎదురూగా 2 & 3 BHK Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-26837]

■ వరంగల్, రంగశాయిపేట, శేషాద్రిహిల్స్‌లో E/F తో గల డీలక్స్ Ready to Occupy 2 BHK House అమ్మకానికి కలదు. సెల్: 7660008666, 8309035091. [WA-26838]

■ ములుగురోడ్డు కాకతీయ కెనాల్ కన్నేమూల గణపతి టెంపుల్‌కి దగ్గరలో G+1 తో గల Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-26839]

FLAT FOR SALE

■ 2BHK Decent Flat @TNGOs Colony Rd Snehanagar Jn@ 3rd Floor Ready to Move. Cupboards, False Ceiling, Lift, Car Parking@ 68 lakhs Call @ 8985156808 [HA-10425]

SERVICES

■ హౌజ్, ఫ్లాట్, ఓపెన్ ప్లాట్, ల్యాండ్, వ్యవసాయ భూమి, వ్యక్తిగత, ఏ ప్రాపర్టీ అయినా మార్టిగేజ్ చేసుకొని వారంలో అమౌంట్ ఇప్పించబడును. సెల్: 9666142226. [W-785458]

■ బాలాజీ గోల్డ్. మీ బంగారం బ్యాంకులో గాని ఏ ఇతర సంస్థలో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) తాకట్టు షిఫ్టింగ్ చేయబడును. 9032040019. [T-1775]

VEHICLE FOR SALE

■ M/s. Indusind Bank Ltd. Vehicles for sale Through closed Cover Quotations Accepted. TS03FA2489- HONDA WR - V BS6-2020M, Ph: 8686863680, 9963009028 [W-775795]

WATER PROOFING

■ మీరు వాటర్‌లీకేజి సమస్యతో బాధపడుతున్నారా? అయితే బాత్‌రూమ్స్ స్లాబ్స్, వాటర్ ట్యాంక్స్, ఏ ఇతర లీకేజి ఐనాసరే అధునాతనమైన కెమికల్స్‌తో గ్యారంటీతో చేయబడును. ✆ 99 66 77 37 37 [B-786697]

WANTED

■ ఇంట్లో వంట పని చేయుటకు ఆడ వంట మనిషి వెంటనే కావలెను. జీతం 4K to 5K వివరాలకు సంప్రదించండి, కాశిబుగ్గ, వరంగల్. సెల్: 9000705771. [W-785457]

■ ప్రముఖ కంపెనీలో లక్కీ కూపన్స్ బుక్ చేయుటకు వాక్చాతుర్యం కలిగిన యువతీ యువకులు కావలెను. వేతనము: రూ॥ 12000/-. సంప్ర॥ 9666581883, 9704128229. [WA-6923]

■ మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ నందు పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ వెంటనే కావలెను. 12 గం॥ల డ్యూటీ. జీతం: 10,000-12,000/- + ESI, EPF. సంప్ర॥ 8978459111. [W-785453]

■ Wanted Sales Executive / Collection Executive for Delicious Farms Chicken Outlets in Warangal Required Exp. in same domain. Sal + Bonus. Age: 25-35yrs. Timings: 8am-7pm. 8106112401 [W-785456]

■ Wanted Female Admin HR & Male System Operators. 100% Skills in MS-Office & Photoshop. Give Good Salary Q: Any Graduation. Cont: 9182225999. [WA-5332]

■ Any Qualification Fluency in English & Hindi. Office Asst & Primary Lady Teachers, P.E.T. Cont: Pavani School, Edga, HNK. Cell: 9393350567 [WA-6906]

■ వరంగల్‌లోని కిరాణం షాప్ నందు పని చేయుటకు 3 సం॥ల అనుభవం కల్గిన (స్త్రీ/పు) కావలెను. వరంగల్ లోకల్ వారు మాత్రమే సంప్రదించండి. యువరాజ్ కిరాణం, వరంగల్. 9490133696 [W-1110260]

■ Delicious Farms Chicken outlets is hiring for following positions in Warangal. 1) Collection Executive /Delivery Executive, 2) Accounts Executive Relevant Exp. is mandatory. Age 20-35 yrs, Cont: 8106112401. [W-1110262]

■ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. పార్ట్/ఫుల్ టైం. సాలరీ Rs.20,000/- ఆపైన M.S.K Enterprises, సూర్య బార్ ప్రక్కన, పోచమ్మమైదాన్, WGL. Cell: 7396205081. [WA-166]

■ వరంగల్‌లోని బిజెస్ సెంటర్‌లో పని చేయుటకు అనుభవం గల వర్కర్స్ కావలెను. జీతం: 21,000 + రూం + భోజనం ఫ్రీ. సంప్ర: 6281342090, 9949857816. [WA-6922]

■ మహారాష్ట్ర & కర్ణాటక నందు పనిచేయుటకు లిఫ్ట్ ఇరిగేషన్ నందు అనుభవం ఉన్న మెకానికల్, ఎలక్ట్రికల్, సివిల్ ఇంజనీర్స్, మేనేజర్స్ కావలెను. సంస్థ:PVR Projects Ltd., కాల్: 040-23348080, 23338080, adm.vineela@gmail.com [H-793588]

■ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకోనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను, ఫ్రీ వసతి + భోజనం, జీ:16K, ఏజెంట్ కమీషన్ 6K. ఫోన్: 9840258899. [H-786849]

■ ఇంటి దగ్గర ఉండి మా కంపెనీ బల్బులు ఫిట్ చేసి ఇవ్వడం ద్వారా నెలకి 15,000–20000 వరకు జీతం. మరిన్ని వివరాలకై, సెల్: 9030007628. [G-795222]

■ సెక్యూరిటీ సూపర్‌వైజర్స్, సెక్యూరిటీ గార్డ్స్, కోదాడ దగ్గర కావలెను. 8 గం॥ డ్యూటీ, మంచి జీతం, తక్కువ రేటుకు భోజనం, ఫ్రీ రూం. ✆ 63008 79854, 86884 17132. [B-970]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-7095231]

■ వరంగల్ సిటీలో పని చేయుటకు హెవీ వెహికిల్ లైసెన్స్ కలిగిన డ్రైవర్ కావలెను. అనుభవం గల వారికి ప్రాధాన్యత. సంప్ర. 96665 29264, 98665 68003, 99481 60247. [M-1190651]

■ మాదాపూర్‌లో ఇంటిపని, వంటపని చేసు కొని సీనియర్ సిటిజెన్‌ను చూసుకోవటానికి 40–55 వయసుగల 10వ తరగతి చదివిన మగ మనిషి కావలెను. ఫోన్: 7207914195 [H-793465]

ప్రజా.. జాగృతానికి జనచైతన్యయాత్ర


హనుమకొండ: సభలో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం


వరంగల్:మల్లు లక్ష్మికి పార్టీ కండువా కప్పి కరచాలనం చేస్తున్న ఏచూరి

- సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఏచూరి చేతుల మీదుగా ప్రారంభం
- వరంగల్, హనుమకొండలలో బహిరంగసభలనుంచి శ్రీకారం
- మతోన్మాద మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలంటూ పిలుపు

న్యూశాయంపేట/వరంగల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద, కార్పొరేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా, జనాన్ని జాగృతం చేసేందుకు సీపీఎం కేంద్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం మొదటి జనచైతన్య యాత్ర వరంగల్‌లో ప్రారంభమైంది. యాత్రను పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి వరంగల్ ఆజంజాహి మిల్లు మైదానంలో ప్రారంభించారు. ఆయనతోపాటు రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్‌రావు, మల్లు లక్ష్మి, పాల్గొనగా సీపీఐ యాత్రకు సంఘీభావం తెలుపుతూ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు బహిరంగసభలో ప్రసంగించారు. ప్రజాసామ్య పరిరక్షణ, సామాజిక న్యాయంలో భాగంగా సీపీఎం రాష్ట్ర కమిటీ యాత్ర వరంగల్ నుంచే ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా మూడు యాత్రలు ప్రారంభం కానుండగా తొలుత వరంగల్‌లో ప్రారంభమైంది. ఇందులోభాగంగా మొదట కాజీపేటనుంచి బైక్ ర్యాలీ, హనుమకొండ కుడా మైదానం, వరంగల్ జిల్లా అజంజాహి మిల్లు మైదానం కేంద్రాల్లో బహిరంగ సభలు ఆయా జిల్లా కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ యాత్ర ఈ నెల 29వరకు సాగనుంది. యాత్రకు రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు నేతృత్వం వహిస్తారు. వీరి బృందంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, జి.నాగయ్య, చెరుపల్లి సీతారాములు, జూలకంటి రంగారెడ్డి, పాలడుగు భాస్కర్, మల్లు లక్ష్మిలు ఉంటారు. వీరికి సీతారాం ఏచూరి వేదికపై పార్టీ కండువాలు కప్పి ఆల్‌ది బెస్ట్ తెలిపారు. అనంతరం సీతారాం ఏచూరి జనచైతన్యయాత్ర పాటల సీడీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేంద్ర కమిటీ నాయకులు జి.నాగయ్య, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి, రాష్ట్ర కమిటీ సభ్యులు జగదీష్, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్, బి.చక్రపాణి, గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీరాంనాయక్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామస్వామి, బాబు, రత్నమాల, వాసుదేవరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రాగుల రమేశ్, గొడుగు వెంకట్, ఉప్పలయ్య, వీరన్న నాయక్, మిశ్రీన్ సుల్తానా, సీపీఐ నాయకులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, మేకల రవి పాల్గొన్నారు.

మోదీని గద్దె దించాలి:

– సీతారాం ఏచూరి



దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలంటే మోదీని గద్దె దించినప్పుడే సాధ్యం. నిరుద్యోగం ఆకాశం అంటుతోంది. ప్రతి ఏటా 2కోట్ల ఉద్యోగాలు ఇస్తామని అన్నారు. కానీ, ఉన్న ఉద్యోగాలు ఊడిపోయాయి. మహారాష్ట్రంలో ఉల్లి రైతులకు కనీస ధర లేకపోవడం, ఎంఎస్‌పీ అమలు చేయకపోవడం వల్ల నాసిక్ నుంచి ముంబై వరకు రైతుల లాంగ్ మార్చ్ మళ్లీ మొదలైంది. దేశంలో 80కోట్ల మందికి అన్నం లేక పోవడంతో 5కేజీల బియ్యం ఇస్తున్నామని మోదీ ప్రచారం చేసుకుంటున్నారు. అంటే దేశం ఎంత అధ్వాన పరిస్థితుల్లో ఉందన్న విషయాలను గుర్తించాలి. గుడిసెవాసులకు సీపీఎం ఎల్లప్పుడు అండగా ఉంటుంది. తెలంగాణలో ప్రజాచైతన్య యాత్రలో ప్రజలను చైతన్యపరుస్తాం.

కలిసి ఉద్యమిస్తాం

– కూనంనేని సాంబశివరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి



ప్రజల హక్కులు, సమస్యల పరిష్కారం, పేదలకు నివేశన స్థలాల కోసం సీపీఐ, సీపీఎంలు ఒకే గొడుగు కింద పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నాయి. రెండు పార్టీలు సుమారు 40వేల పేదలకు ఇళ్ల నిర్మాణానికి గుడిసెలు వేయించాయి. ప్రభుత్వ భూముల్లో నివాసం ఉన్న వారికి పట్టాలు ఇస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించడంతో మనం ఉన్న భూములు ప్రభుత్వానివే కావడం వల్ల పట్టాలు వస్తాయి. సీపీఎం, సీపీఐ కార్యక్రమాలకు ఇరు పార్టీల నాయకులు హాజరవుతున్నాం. రానున్న ఎన్నికల్లో ఉమ్మడిగా పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నాం.

ప్రగతిశీల శక్తులు ఏకం

– తమ్మినేని వీరభద్రం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి



ప్రగతి శీల శక్తులు ఏకమై బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు పోరాటం కొనసాగిస్తాం. దేశంలో మనుధర్మశాస్త్రాన్ని బలంగా తీసుకెళ్లి ప్రజల్ని విడదీసేందుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు ప్రయత్నిస్తున్నాయి. కేసుల భయానికి బీజేపీ పార్టీలో చేరగానే కేసులు మాఫ్ అంటే కుదరదు. గుడిసెలు వేసుకున్న ప్రతిపేద కుటుంబానికి ఇంటిపట్టా ఇచ్చి గృహలక్ష్మి పథకం ద్వారా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. అప్పటివరకు కేసీఆర్ ప్రభుత్వాన్ని విడిచి పెట్టేది లేదు. బీజేపీని ఓడించడమే తన లక్ష్యమని సీఎం కేసీఆర్ బహిరంగంగా ప్రకటించడం హర్షణీయం.

సాక్షి బిజినెస్
శనివారం
18-3-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	355	57,990
నిఫ్టీ ▲	114	17,100

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	11,650	▽ 66
డోజోన్స్	31,923	▽ 323
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,335	▽ 75
డాక్స్	14,768	▽ 199
షాంఘై	3,251	▲ 24
నికాయ్	27,334	▲ 323

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) ముంబై	
బంగారం (24 క్యారట్) 58,882	▽ 121
బంగారం (22 క్యారట్) 58,646	▽ 120
వెండి (కేజీ) 71,576	▽ 523

బిస్లెరీతో చర్చలకు 'టాటా'

వ్యాపార విస్తరణపై దృష్టి కొనసాగింపు



న్యూఢిల్లీ: ప్యాకేజ్డ్ వాటర్ బిజినెస్ కొనుగోలుకి బిస్లెరీ ఇంటర్నేషనల్‌తో చేపట్టిన చర్చలకు చెక్ పడినట్లు ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం టాటా కన్జూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్(టీసీపీఎల్) తాజాగా వెల్లడించింది. ఇటీవల కొద్ది రోజులుగా బిస్లెరీ బ్రాండును టాటా గ్రూప్ కొనుగోలు చేయనున్నట్లు అంచనాలు పెరిగిన నేపథ్యంలో చర్చలు నిలిపివేసినట్లు నియంత్రణ సంస్థలకు టాటా కన్జూమర్ తెలియజేసింది. ప్యాకేజ్డ్ వాటర్ బిజినెస్ కొనుగోలుకి బిస్లెరీ ఇంటర్నేషనల్‌తో ఎలాంటి తప్పనిసరి ఒప్పందాలు కుదుర్చుకోలేదని స్పష్టం చేసింది. ఇందుకు ఎలాంటి కట్టుబాట్లనూ ఏర్పాటు చేసుకోలేదని తెలియజేసింది. అయితే వ్యాపార విస్తరణ, వృద్ధి అవకాశాలకున్న వ్యూహాత్మక అంశాలపై దృష్టి కొనసాగిస్తున్నట్లు పేర్కొంది. ఇకపైనా బిస్లెరీ ఇంటర్నేషనల్ సహా వివిధ సంస్థలతో చర్చలు నిర్వహించే వీలున్నట్లు వెల్లడించింది. కాగా.. బిస్లెరీ ఇంటర్నేషనల్ విక్రయానికి టీసీపీఎల్‌తోపాటు పలు కొనుగోలుదారులతో చర్చలు నిర్వహిస్తున్నట్లు ప్రమోటర్, వెనుకటితరం పారిశ్రామికవేత్త రమేష్ చౌహాన్ గతేడాది పేర్కొన్నారు. మరోవైపు మరిన్ని మార్కెట్లలో విస్తరించేందుకు అనువుగా టీసీపీఎల్ పలు కంపెనీలను కొనుగోలు చేస్తూ వస్తోంది. టీసీపీఎల్‌కు ఇప్పటికే హిమాలయన్ బ్రాండుతో బాటిల్డ్ వాటర్ విభాగంలో కార్యకలాపాలు ఉన్నాయి.

తాజా వివరణ నేపథ్యంలో టీసీపీఎల్ షేరు 2 శాతం బలపడి రూ. 708 వద్ద ముగిసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
18-2-2023	
విశాఖ	450-00
చిత్తూరు	473-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	438-00
విజయవాడ	438-00
రిటైల్ ధర (డజను)	66.00
17-2-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	425-00
వరంగల్	427-00
రిటైల్ ధర	4.95

మా ఉత్పత్తులకు హబ్‌గా శ్రీసిటీ

- ఈసారి బిలియన్ డాలర్ల ఆదాయ లక్ష్యం
- బ్లూస్టార్ ఎండీ త్యాగరాజన్ వెల్లడి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రాబోయే రోజుల్లో తమ ఉత్పత్తులకు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీ హబ్‌గా మారగలదని ఎయిర్ కండీషనింగ్, రిఫ్రిజిరేషన్ ఉత్పత్తుల సంస్థ బ్లూస్టార్ ఎండీ బి. త్యాగరాజన్ చెప్పారు. ఇప్పటికే అక్కడ ఇన్వెస్ట్ చేసినవి, కొత్తగా చేయబోయేవి కలిపి రాబోయే మూడేళ్లలో మొత్తం రూ. 1,000 కోట్ల పైచిలుకు పెట్టుబడి పెట్టినట్లవుతుందని త్యాగరాజన్ వివరించారు. వ్యూహాత్మక స్థానంలో ఉన్నందున సరుకు రవాణా, నిల్వ చేసుకోవడం వంటి విషయాలకు సంబంధించి తమకు ఇది ప్రయోజనకరంగా ఉంటోందని పేర్కొన్నారు. శుక్రవారమిక్కడ కొత్త ఉత్పత్తులను ఆవిష్కరించిన సందర్భంగా త్యాగరాజన్ ఈ విషయాలు చెప్పారు. శ్రీసిటీలో రూమ్ ఏసీల తయారీకి సంబంధించి మొత్తం నాలుగు దశల్లో ప్రస్తుతం తొలి దశ పూర్తయి ఇటీవలే ఉత్పత్తి మొదలైందని చెప్పారు. మిగతావి కూడా పూర్తయితే 12 లక్షల వార్షిక ఉత్పత్తి సామర్థ్యం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. అటు కమర్షియల్ ఏసీల తయారీకి సంబంధించి రెండో ప్లాంటు నిర్మాణం కోసం 40 ఎకరాలు సమీకరించినట్లు, 2024లో పనులు, 2025లో ఉత్పత్తి ప్రారంభం కాగలదని అంచనా వేస్తున్నట్లు త్యాగరాజన్ చెప్పారు. గత కొద్ది త్రైమాసికాలుగా సానుకూల ఫలితాలు నమోదు చేస్తున్న నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బిలియన్ డాలర్ల ఆదాయం (దాదాపు రూ. 8,200 కోట్లు) అంచనా వేస్తున్నట్లు ఆయన తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో సంస్థ రూ. 6,046 కోట్ల ఆదాయం నమోదు చేసింది.



బ్లూస్టార్ కొత్త ఉత్పత్తుల శ్రేణి ఆవిష్కరణ కార్యక్రమంలో సంస్థ వైస్ ప్రెసిడెంట్ ఎం శ్రీనివాస్ రెడ్డి (ఎడమ), ఎండీ బి. త్యాగరాజన్

అంతర్జాతీయంగా విస్తరణ..: కొత్త విభాగాల్లో ప్రవేశించడం కన్నా ఇతర దేశాల్లో మరింత విస్తరించడంపై దృష్టి పెడుతున్నట్లు త్యాగరాజన్ చెప్పారు. ప్రస్తుతం మధ్యప్రాచ్య దేశాలకు ఎగుమతి చేస్తుండగా అమెరికా, యూరప్ తదితర మార్కెట్లలోనూ కార్యకలాపాలకు సిద్ధమవుతున్నట్లు వివరించారు. ఆయా మార్కెట్లకు ఈ ఏడాది ఆఖరు నుంచే ఎగుమతులు మొదలుపెట్టే అవకాశం ఉందన్నారు.

కొత్త ఫ్రీజర్ల శ్రేణి..

బ్లూస్టార్ ఆవిష్కరించిన కొత్త ఉత్పత్తుల శ్రేణిలో దేశీయంగా తీర్చిదిద్దిన డీప్ ఫ్రీజర్లు, రిఫ్రిజిరేషన్ ఉత్పత్తులు ఉన్నాయి. వీటి కూలింగ్, నిల్వ సామర్థ్యాలు మరింత అధికంగా ఉంటాయని, వీటిని మహారాష్ట్రలోని వాడా ప్లాంటులో తయారు చేశామని త్యాగరాజన్ తెలిపారు. రాబోయే రోజుల్లో తమ సంస్థ వృద్ధికి కమర్షియల్ రిఫ్రిజిరేషన్ మరింతగా ఊతమివ్వగలదని పేర్కొన్నారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో ఈ విభాగం నుంచి తమకు రూ. 70 కోట్లు, దక్షిణాదిలో రూ. 235 కోట్ల పైచిలుకు ఆదాయం వస్తోందన్నారు. మొత్తం అన్ని విభాగాల రీత్యా చూస్తే తమ సంస్థ 20–25 శాతం వృద్ధి సాధిస్తోందని, పరిశ్రమ వృద్ధి సుమారు 15–20 శాతం మేర ఉంటోందని పేర్కొన్నారు.

హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం విలీనానికి ఓకే

ఎన్‌సీఎల్‌టీ అనుమతి



న్యూఢిల్లీ: ఫైనాన్షియల్ రంగ దిగ్గజాలు హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ విలీనానికి జాతీయ కంపెనీ చట్ట ట్రిబ్యునల్(ఎన్‌సీఎల్‌టీ) తాజాగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో ప్రైవేట్ రంగ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌తో దేశంలోనే అతిపెద్ద మార్టిగేజ్ కంపెనీ హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్ విలీనంకానుంది. వెరసి దేశీ కార్పొరేట్ చరిత్రలోనే ఇది అతిపెద్ద విలీనంగా నమోదుకానుంది. ఇందుకు ఇప్పటికే నియంత్రణ సంస్థలు ఆర్‌బీఐ, సెబీ, పీఎఫ్‌ఆర్‌డీఏ, సీసీఐ అనుమతించాయి. స్టాక్ ఎక్స్చేంజీ దిగ్గజాలు బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈ సైతం ఓకే చెప్పాయి. ఈ బాటలో రెండు సంస్థల వాటాదారుల నుంచి అనుమతి కోరేందుకు ఎన్‌సీఎల్‌టీ అనుమతించింది. వచ్చే ఆర్థిక సంవత్సరం క్యూ3 నాటికి విలీనం పూర్తికావచ్చని అంచనా.

ట్యూబులర్ బిడ్‌కు గ్రీన్‌సిగ్నల్

రుణ సంక్షోభంలో చిక్కుకున్న సింటెక్స్ కొనుగోలుకి ప్రాపెల్ ప్లాస్టిక్ ప్రొడక్ట్స్, ప్లాస్టాటో (ట్యూబులర్ పైప్స్) కన్సార్షియం వేసిన బిడ్‌కు ఎన్‌సీఎల్‌టీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బిడ్ విలువ రూ. 1,250 కోట్లుగా సంబంధిత వర్గాలు తెలియజేశాయి.

సరికొత్త ఫీచర్లతో పల్సర్ ఎన్‌ఎస్ సిరీస్



హైదరాబాద్: బజాజ్ ఆటో తన పల్సర్ ఎన్‌ఎస్ నేకెడ్ స్ట్రీట్‌ఫైటర్ లైన్‌కు అప్‌డేట్ వెర్షన్‌ను విడుదల చేసింది. ఈ సిరీస్‌లోని ఎన్‌ఎస్ 160, ఎన్‌ఎస్ 200 మోడళ్లను సరికొత్త ఫీచర్లతో తీసుకొచ్చింది. వీటి ధరలు వరుసగా రూ.1.35 లక్షలు.., రూ.1.47 లక్షలుగా ఉన్నాయి. మంచి హ్యాండ్లింగ్ కోసం యూఎస్‌డీ ఫ్రంట్ ఫోర్క్‌లు, మెరుగైన భద్రతకు డ్యూయల్ చానల్ ఏబీఎస్‌ను అమర్చారు. ఇన్ఫినిటీ డిస్‌ప్లే కొత్త పల్సర్లలో ప్రత్యేకం. డిస్‌ప్లే కన్సోల్‌లో ఇప్పుడు గేర్ పొజిషన్ ఇండికేటర్ కూడా ఉంది. ఎన్‌ఎస్ 200 మోడల్ 18.75 ఎన్‌ఎమ్ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. 6–స్పీడ్ మ్యాన్యువల్ గేర్‌బాక్స్‌తో జత చేశారు. ఎన్‌ఎస్ 160 మోడల్ 14.6 ఎన్‌ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఇంజిన్ 5–స్పీడ్ గేర్‌బాక్స్‌తో వస్తుంది.

బిగ్'సి' ఉగాది ఆఫర్లు



హైదరాబాద్: మొబైల్స్ రిటైల్ విక్రయ సంస్థ 'బిగ్ సి' ఉగాది పండుగ సందర్భంగా వినూత్న ఆఫర్లు ప్రకటించింది. మొబైల్స్, స్మార్ట్ టీవీలు, ల్యాప్‌టాప్‌ల కొనుగోలుపై ఆకర్షణీయ రాయితీలు అందిస్తున్నట్లు కంపెనీ సీఎండీ యం.బాలు చౌదరి తెలిపారు. స్మార్ట్ ఫోన్ల కొనుగోలుపై పదిశాతం వరకు క్యాష్ బ్యాక్‌తో పాటు ఎలాంటి వడ్డీ, డౌన్ పేమెంట్ లేకుండా సులభ ఈఎంఐలలో పొందొచ్చన్నారు. స్మార్ట్ టీవీల కొనుగోలుపై 1,500 వరకు క్యాష్ బ్యాక్ ఇస్తుందన్నారు. సులభ ఈఎంఐ పద్ధతిలో ల్యాప్‌టాప్స్ కొనే సౌకర్యం కూడా ఉందన్నారు. ''ప్రతి కొనుగోలుపై కచ్చితమైన బహుమతి ఉంటుంది. మా రిటైల్ స్టోర్లలో ఆన్‌లైన్ కంటే తక్కువ ధరలకే ఉత్పత్తులు లభిస్తాయి. ప్రజలంతా ఈ ఆఫర్లను వినియోగించుకోవాలి'' అని బాలు చౌదరి కోరారు.

ఫోన్‌పే రూ. 1,650 కోట్ల సమీకరణ



న్యూఢిల్లీ: ఫిన్‌టెక్ సంస్థ ఫోన్‌పే కొత్తగా 200 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 1,650 కోట్లు) సమీకరించింది. 12 బిలియన్ డాలర్ల వేల్యుయేషన్‌తో ప్రధాన వాటాదారు వాల్‌మార్ట్ ఈ మేరకు నిధులు సమకూర్చింది. సింగపూర్ నుంచి భారత్‌కు కార్యాలయాన్ని మార్చుకున్న నేపథ్యంలో ఫోన్‌పే 1 బిలియన్ డాలర్ల వరకూ మూలధనాన్ని సేకరించే ప్రయత్నాల్లో ఉంది. తాజాగా అందిన నిధులతో ఇప్పటివరకూ 650 మిలియన్ డాలర్లు (దాదాపు రూ. 5,360 కోట్లు) సమీకరించినట్లవుతుంది. మిగతా పెట్టుబడులను కూడా త్వరలోనే ప్రకటించే అవకాశం ఉంది. ఈ నిధులను బీమా, వెల్త్ మేనేజ్‌మెంట్, రుణాలు, స్టాక్ బ్రోకింగ్ మొదలైన వ్యాపార విభాగాల వృద్ధికి ఉపయోగించుకోనుంది. గూగుల్ పే, పేటీఎంలతో ఫోన్‌పే పోటీపడుతోంది.

ఒడిదుడుకులున్నా... లాభాలే!

- 17,100 వద్ద నిఫ్టీ ముగింపు
- సెన్సెక్స్ లాభం 355 పాయింట్లు
- రెండో రోజూ ముందడుగు

ముంబై: ఒడిదుడుకుల ట్రేడింగ్‌లో స్టాక్ సూచీలు శుక్రవారం లాభాలు గడించాయి. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో రికవరీ ఇన్వెస్టర్లకు ఉత్సాహాన్నిచ్చింది. క్రూడ్ ధరలు దిగిరావడం, రూపాయి బలపడటం కలిసొచ్చాయి. మెటల్, బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగాల షేర్లు రాణించాయి. ఉదయం సెన్సెక్స్ 403 పాయింట్లు బలపడి 58,038 వద్ద, నిఫ్టీ 126 పాయింట్లు పెరిగి 17,112 వద్ద మొదలయ్యాయి. భారీ లాభాల ప్రారంభం నేపథ్యంలో ఇన్వెస్టర్లు తొలి దశలో లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. ఫలితంగా సూచీలు మిడ్‌సెషన్ కల్లా ఆరంభ లాభాలను కోల్పోయాయి. ఒక దశలో సెన్సెక్స్ 131 పాయింట్లు నష్టపోయి 57,504 వద్ద, నిఫ్టీ 28 పాయింట్లు పతనమై 16,958 వద్ద ఇంట్రాడే కనిష్టాలను నమోదు చేశాయి. ద్వితీయార్థంలో కనిష్టస్థాయిల వద్ద కొనుగోళ్ల మద్దతు లభించింది. చివరి వరకు అదే జోరు కొనసాగడంతో సెన్సెక్స్ 355 పాయింట్లు బలపడి 57,990 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 114 పాయింట్లు పెరిగి 17,100 వద్ద నిలిచింది. విస్తృత స్థాయి మార్కెట్లో కొనుగోళ్ల మద్దతు లభించడంతో బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు అరశాతం చొప్పున పెరిగాయి. ఆటో, ఎఫ్‌ఎంసీజీ, ఫార్మా, మీడియా షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఎఫ్‌పీఐలు రూ.1817 కోట్ల షేర్లను అమ్మేశారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1767 కోట్ల షేర్లను కొన్నారు. డాలర్ మారకంలో రూపాయి విలువ 28 పైసలు క్షీణించి 82.65 స్థాయి వద్ద స్థిరపడింది. ఆసియా మార్కెట్లు 1% లాభపడ్డాయి. యూరప్ మార్కెట్లు 0.5% నష్టపోయాయి. యూఎస్ స్టాక్ సూచీలు ఒకశాతం నష్టాల్లో ట్రేడవుతున్నాయి.



మార్కెట్లో మరిన్ని సంగతులు

- బ్లాక్ డీల్ ద్వారా భారీ సంఖ్యలో షేర్లు మారడంతో బయోకాన్ షేరు 9% నష్టపోయి రూ.202 వద్ద స్థిరపడింది.
- రియల్టీ రంగ సంస్థ డీఎల్‌ఎఫ్ షేరు నాలుగుశాతానికి పైగా లాభపడి రూ 375 వద్ద స్థిరపడింది. అతి తక్కువ సమయంలో రికార్డు స్థాయిలో రూ.8,000 కోట్ల విలువైన లగ్జరీ ఫ్లాట్లను విక్రయించడంతో ఈ షేరుకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ట్రేడింగ్‌లో ఐదు శాతం పెరిగి రూ.377.50 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది.
- కేంద్రం రూ.70,500 కోట్ల రక్షణ ఉత్పత్తుల కొనుగోళ్లకు అనుమతినివ్వడంతో హిందూస్తాన్ ఏరోనాటిక్స్ షేరు మూడుశాతం లాభపడి రూ.2,780 వద్ద ముగిసింది.

ఉత్తమ ఆటగాళ్లుగా సవితా పూనియా, హార్దిక్ సింగ్

భారత హాకీ సమాఖ్య (హెచ్‌ఐ) 2022 సంవత్సరానికిగాను భారత జట్టుకు సంబంధించి వార్షిక అవార్డులను ప్రకటించింది. పురుషుల విభాగంలో మిడ్‌ఫీల్డర్ హార్దిక్ సింగ్, మహిళల విభాగంలో సవితా పూనియా హాకీ ఇండియా ఉత్తమ ఆటగాళ్లుగా నిలిచారు. ఒడిశాలో జరిగిన హాకీ ప్రపంచకప్‌లో హార్దిక్ అద్భుత ఆటతీరు కనబర్చాడు. ఎఫ్‌ఐహెచ్ ఉమెన్స్ నేషనల్ కప్ టైటిల్ గెలిపించి ప్రొ లీగ్‌కు భారత జట్టు అర్హత సాధించడంలో కీపర్‌గా, కెప్టెన్‌గా సవిత కీలక పాత్ర పోషించింది. ఇద్దరికీ హాకీ ఇండియా తరఫున రూ. 25 లక్షల చొప్పున నగదు పురస్కారం లభించింది. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో వీటిని అందజేశారు. దీంతో పాటు 2021కు సంబంధించిన అవార్డులను కూడా ప్రకటించగా హర్మన్‌ప్రీత్, సవితా పూనియా అత్యుత్తమ ఆటగాళ్లుగా అవార్డులు అందుకున్నారు. 2022లో సుల్తాన్ జొహార్ కప్ గెలిచిన భారత జూనియర్ జట్టును కూడా ఈ సందర్భంగా సత్కరించారు.



రాహుల్, జడేజా గెలిపించగా...



- తొలి వన్డే భారత్‌దే
- 5 వికెట్లతో ఓడిన ఆస్ట్రేలియా
- రాణించిన షమీ, సిరాజ్
- ఆదివారం విశాఖపట్నంలో రెండో వన్డే

తొలి వన్డేలో భారత్ విజయలక్ష్యం 189 పరుగులే...దీనిని చూస్తే ఛేదన చాలా సులువనిపించింది. కానీ ఒక దశలో స్కోరు 16/3 కాగా, ఆపై 39/4కు మారింది...ప్రతికూలంగా ఉన్న పిచ్‌పై భారత బ్యాటర్లు శ్రమించాల్సి వచ్చింది. చివరకు రాహుల్, జడేజా శతక భాగస్వామ్యం జట్టును విజయం దిశగా నడిపించింది. ఎనిమిది నెలల తర్వాత ఆడిన తొలి వన్డేలో జడేజా ఆల్‌రౌండ్ ప్రదర్శన నమోదు చేయగా, టెస్టుల్లో బ్యాటింగ్‌పై తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న రాహుల్ వన్డేల్లో తానేంటో చూపించాడు. అంతకు ముందు భారత బౌలర్లు ఆసీస్‌ను కట్టి పడేశారు. మిచెల్ మార్ష్ మెరుపు బ్యాటింగ్ ప్రదర్శన జట్టు భారీ స్కోరు చేసేందుకు సరిపోలేదు.

ముంబై: ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌లో భారత్ శుభారంభం చేసింది. శుక్రవారం జరిగిన తొలి వన్డేలో భారత్ 5 వికెట్ల తేడాతో ఆసీస్‌పై విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా 35.4 ఓవర్లలో 188 పరుగులకే కుప్పకూలింది. మిచెల్ మార్ష్ (65 బంతుల్లో 81; 10 ఫోర్లు, 5 సిక్స్‌లు) మినహా అంతా విఫలమయ్యారు. అనంతరం భారత్ 39.5 ఓవర్లలో 5 వికెట్లకు 191 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్ (91 బంతుల్లో 75 నాటౌట్; 7 ఫోర్లు, 1 సిక్స్), రవీంద్ర జడేజా (69 బంతుల్లో 45 నాటౌట్; 5 ఫోర్లు) ఆరో వికెట్‌కు అభేద్యంగా 108 పరుగులు జత చేశారు. 2 వికెట్లు, 1 కీలక క్యాచ్‌తో పాటు బ్యాటింగ్‌లో రాణించిన జడేజా 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. సిరీస్‌లో భారత్ 1–0తో ఆధిక్యంలో నిలవగా... ఈ నెల 19న వైజాగ్‌లో రెండో వన్డే జరుగుతుంది.

మార్ష్ మినహా...

తన తొలి ఓవర్లోనే ట్రవిస్ హెడ్ (5)ను సిరాజ్ బౌల్డ్ చేయడంతో ఆస్ట్రేలియాకు సరైన ఆరంభం లభించలేదు. అయితే మార్ష్ దూకుడుగా ఆడి జట్టును నడిపించాడు. సిరాజ్ తర్వాతి ఓవర్లో మూడు ఫోర్లు కొట్టిన మార్ష్, సిరాజ్ మరో ఓవర్లోనే రెండు ఫోర్లు బాదాడు. 10 ఓవర్లు ముగిసే సరికి ఆసీస్ స్కోరు 59 పరుగులకు చేరింది. మార్ష్‌కు సహకరించిన స్టీవ్ స్మిత్ (22)ను కీపర్ రాహుల్ చక్కటి క్యాచ్‌తో వెనక్కి పంపడంతో 72 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెర పడింది. మార్ష్ 51 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. కుల్దీప్ ఓవర్లో వరుసగా 4, 6 కొట్టి అతను తన జోరును కొనసాగించాడు. అయితే జడేజా బౌలింగ్‌లో భారీ షాట్‌కు ప్రయత్నించిన మార్ష్ షార్ట్ థర్డ్‌మాన్ వద్ద సిరాజ్‌కు క్యాచ్ ఇచ్చాడు. మార్ష్, లబుషేన్ (15) మూడో వికెట్‌కు 52 పరుగులు జత చేశారు. అంతే...ఆ తర్వాత ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ ఒక్కసారిగా కుప్పకూలింది. 20వ ఓవర్లో 129/2తో మెరుగైన స్థితిలో నిలిచిన ఆ జట్టు 36వ ఓవర్ కూడా ముగియక ముందే ముగిసింది. 59 పరుగుల వ్యవధిలో ఆ జట్టు చివరి 8 వికెట్లు కోల్పోయింది. తన చివరి 14 బంతుల్లో షమీ ఒక్క పరుగు కూడా ఇవ్వకుండా 3 వికెట్లు పడగొట్టగా...సిరాజ్ తన చివరి 10 బంతుల్లో ఒక్క పరుగూ ఇవ్వకుండా 2 వికెట్లు తీశాడు.



శతక భాగస్వామ్యం...

స్వల్ప లక్ష్యాన్ని ఛేదించే ప్రయత్నంలో ఆరంభంలో భారత్ తడబడింది. ఇషాన్ కిషన్ (3) తనకు లభించిన అరుదైన అవకాశాన్ని వృథా చేసుకోగా... స్టార్క్ వరుస బంతుల్లో కోహ్లి (4), సూర్యకుమార్ (0)లను ఎల్బీడబ్ల్యూగా అవుట్ చేసి భారత శిబిరంలో ఆందోళన పెంచాడు. వ్యక్తిగత స్కోర్ల 2, 7 వద్ద ఇన్‌గ్లిస్, స్మిత్ క్యాచ్‌లు వదిలేయడంతో బతికిపోయిన శుబ్‌మన్ గిల్ (20) దానిని ఉపయోగించుకోలేకపోయాడు. ఈ దశలో రాహుల్, హార్దిక్ పాండ్యా (25) కలిసి జట్టును ఆదుకున్నారు. అయితే స్టొయినిస్ బౌన్సర్‌తో పాండ్యాను అవుట్ చేయడంతో 44 పరుగుల ఐదో వికెట్ భాగస్వామ్యం ముగిసింది. విజయానికి మరో 106 పరుగులు చేయాల్సిన ఇలాంటి స్థితిలో ఆస్ట్రేలియాదే పైచేయిగా మారినట్లు అనిపించింది. కానీ రాహుల్, జడేజా జోడి ప్రత్యర్థికి మరో అవకాశం ఇవ్వలేదు. చక్కటి సమన్వయంతో బ్యాటింగ్ చేస్తూ వీరిద్దరు పరుగులు రాబట్టారు. ఈ క్రమంలో 73 బంతుల్లో రాహుల్ హాఫ్ సెంచరీ పూర్తయింది. ఈ జోడీని విడదీసేందుకు ఆసీస్ బౌలర్లు ఎన్ని ప్రయత్నాలు చేసినా లాభం లేకపోయింది.

స్కోరు వివరాలు:

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: హెడ్ (బి) సిరాజ్ 5; మార్ష్ (సి) సిరాజ్ (బి) జడేజా 81; స్మిత్ (సి) రాహుల్ (బి) పాండ్యా 22; లబుషేన్ (సి) జడేజా (బి) కుల్దీప్ 15; ఇన్‌గ్లిస్ (బి) షమీ 26; గ్రీన్ (బి) షమీ 12; మ్యాక్స్‌వెల్ (సి) పాండ్యా (బి) జడేజా 8; స్టొయినిస్ (సి) గిల్ (బి) షమీ 5; అబాట్ (సి) గిల్ (బి) సిరాజ్ 0; స్టార్క్ (నాటౌట్) 4; జంపా (సి) రాహుల్ (బి) సిరాజ్ 0; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (35.4 ఓవర్లలో ఆలౌట్) 188.**

వికెట్ల పతనం: 1–5, 2–77, 3–129, 4–139, 5–169, 6–174, 7–184, 8–184, 9–188, 10–188. **బౌలింగ్:** షమీ 6–2–17–3, సిరాజ్ 5.4–1–29–3, పాండ్యా 5–0–29–1, శార్దుల్ 2–0–12–0, జడేజా 9–0–46–2, కుల్దీప్ 8–1–48–1.

భారత్ ఇన్నింగ్స్: ఇషాన్ కిషన్ (ఎల్బీ) (బి) స్టొయినిస్ 3; గిల్ (సి) లబుషేన్ (బి) స్టార్క్ 20; కోహ్లి (ఎల్బీ) (బి) స్టార్క్ 4; సూర్యకుమార్ (ఎల్బీ) (బి) స్టార్క్ 0; రాహుల్ (నాటౌట్) 75; పాండ్యా (సి) గ్రీన్ (బి) స్టొయినిస్ 25; జడేజా (నాటౌట్) 45; ఎక్స్‌ట్రాలు 19; **మొత్తం (39.5 ఓవర్లలో 5 వికెట్లకు) 191.** **వికెట్ల పతనం:** 1–5, 2–16, 3–16, 4–39, 5–83. **బౌలింగ్:** స్టార్క్ 9.5–0– 49–3, స్టొయినిస్ 7–1–27–2, అబాట్ 9–0–31–0, గ్రీన్ 6–0–35–0, జంపా 6–0–37–0, మ్యాక్స్‌వెల్ 2–0–7–0.



గాయత్రి–ట్రెసా జోరు

- సెమీఫైనల్లో భారత జోడి
- ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్


బర్మింగ్‌హామ్: ప్రతిష్టాత్మక బీడబ్ల్యూఎఫ్ టూర్ సూపర్ 1000 టోర్నీ ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్‌లో పుల్లెల గాయత్రి గోపీచంద్ – ట్రెసా జాలీ దూకుడు కొనసాగుతోంది. మహిళల డబుల్స్‌లో గాయత్రి – ట్రెసా జంట వరుసగా రెండో ఏడాది ఈ టోర్నీ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో భారత ద్వయం 21–14, 18–21, 21–12 స్కోరుతో లీ వెన్ మీ – ల్యూ వాన్ వాన్ (చైనా)పై విజయం సాధించింది. 64 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన ఈ పోరులో ప్రపంచ 17వ ర్యాంక్ జోడి గాయత్రి – ట్రెసా అటు అటాకింగ్, ఇటు డిఫెన్స్‌లో చెలరేగింది. గత ఏడాది కామన్వెల్త్ క్రీడల్లో కాంస్యం సాధించినప్పటినుంచి వరుస విజయాలతో సత్తా చాటుతున్న భారత జంట అదే జోరును ఇక్కడా ప్రదర్శించింది. తొలి గేమ్‌ను ధాటిగా ప్రారంభించిన గాయత్రి – ట్రెసా 6–2తో ఆధిక్యంలోకి దూసుకెళ్లారు. అయితే చైనా జంట 6–6తో స్కోరును సమం చేసింది. ఈ దశలో మళ్లీ చెలరేగిన భారత జోడి ముందుగా 11–8తో ఆధిక్యం ప్రదర్శించి ఆ తర్వాత వరుస పాయింట్లతో 18–12కు దూసుకెళ్లి ఆపై గేమ్‌ను సొంతం చేసుకుంది. రెండో గేమ్‌లో మాత్రం భారత జంటకు గట్టి పోటీ ఎదురైంది. ఏ దశలోనూ ఆధిక్యం అందుకోలేకపోయిన గాయత్రి – ట్రెసా గేమ్‌ను కోల్పోయారు. చివరి గేమ్‌లో మాత్రం మన జట్టుదే హవా నడిచింది. వరుసగా ఆరు పాయింట్లతో 8–1తో ముందంజ వేసిన అనంతరం స్కోరు 11–4..13–5..15–8..18–10...ఇలా సాగింది. 20–12 వద్ద గాయత్రి కొట్టిన ఫోర్‌హ్యాండ్ స్మాష్‌తో భారత జంట విజయం ఖాయమైంది. సెమీ ఫైనల్లో కొరియాకు చెందిన బేక్ హ నా – లీ సా హితో గాయత్రి – ట్రెసా తలపడతారు.



జాస్మిన్, శశి ముందంజ

వరల్డ్ బాక్సింగ్ చాంపియన్‌షిప్

న్యూఢిల్లీ: మహిళల ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత ప్లేయర్లు జాస్మిన్ లంబోరియా, శశి చోప్రా రెండో రౌండ్‌లోకి ప్రవేశించారు. శుక్రవారం జరిగిన తొలి పోరులో జాస్మిన్ (60 కేజీల విభాగం) రిఫరీ స్టాపింగ్ ద కాంటెస్ట్ (ఆర్‌ఎస్‌సీ) ద్వారా ఎన్‌యాంబెగా ఆంబ్రోస్ (టాంజానియా)ను చిత్తు చేసింది. బౌట్ మొదలైన 12 సెకన్లలోనే జాస్మిన్ విసిరిన పంచ్‌లకు ఆంబ్రోస్ తట్టుకోలేకపోవడంతో రిఫరీ ఆటను ఆపివేసి జాస్మిన్‌ను విజేతగా ప్రకటించారు. 63 కేజీల కేటగిరీలో శశి చోప్రా 5–0 స్కోరుతో ఎంవాంగీ టెరిసియా (కెన్యా)పై ఘన విజయం సాధించింది. తర్వాతి రౌండ్‌లో సమడోవా (తజికిస్తాన్)తో జాస్మిన్... కిటో మై (జపాన్)తో శశి తలపడతారు. అయితే 70 కేజీల విభాగంలో భారత్‌కు నిరాశ ఎదురైంది. భారత బాక్సర్ శ్రుతి యాదవ్ 0–5తో జో పాన్ (చైనా) చేతిలో ఓటమిపాలైంది. నేడు భారత బాక్సర్లు నీతూ ఘంఘస్, మంజు బంబోరియా తొలి రౌండ్‌లో ఆడతారు.



ఐర్లాండ్‌తో భారత్ టి20 సిరీస్

డబ్లిన్: ఈ ఏడాది ఆగస్టులో భారత్‌తో టి20 సిరీస్‌కు ఐర్లాండ్ బోర్డు ఆతిథ్యం ఇవ్వనుంది. ఆగస్టు 18 నుంచి 23 వరకు జరిగే ఈ సిరీస్‌లో ఇరు జట్ల మధ్య మూడు టి20 మ్యాచ్‌లు నిర్వహిస్తారు. అయితే మరి కొద్ది రోజుల తర్వాత స్వదేశంలో వన్డే వరల్డ్ కప్ ఉన్న నేపథ్యంలో భారత్ కోణంలో ఈ టి20 సిరీస్‌కు ప్రాధాన్యత లేదు కాబట్టి ద్వితీయ శ్రేణి జట్టు పాల్గొనే అవకాశం ఉంది.

న్యూజిలాండ్ 155/2

వెల్లింగ్టన్: శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టులో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 2 వికెట్లు కోల్పోయి 155 పరుగులు చేసింది. డెవాన్ కాన్వే (108 బంతుల్లో 78; 13 ఫోర్లు) అర్ధ సెంచరీ సాధించాడు. వర్షం, వెలుతురులేమి కారణంగా శుక్రవారం 48 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది.

'కెంట్' తరఫున అర్ష్‌దీప్ సింగ్

కెంట్: భారత లెఫ్టార్మ్ పేసర్ అర్ష్‌దీప్ దీప్ సింగ్ వచ్చే సీజన్‌లో ఐదు మ్యాచ్‌లలో 'కెంట్' కౌంటీకి ప్రాతినిధ్యం వహిస్తాడు. అర్ష్‌దీప్ భారత్ తరఫున 3 వన్డేలు, 26 టి20ల్లో ఆడాడు. భవిష్యత్తులో భారత టెస్టు జట్టులో అవకాశాల కోసం ఫస్ట్‌క్లాస్ క్రికెట్ ఆడమని, కౌంటీలు ఆడితే ప్రదర్శన మెరుగవుతుందని కోచ్ ద్రవిడ్ చేసిన సూచనతో అతను కౌంటీ క్రికెట్ వైపు వెళుతున్నాడు.